# గలగలా గోదారి

-భైరవయ్య

"నీ శ్రాద్ధం బెట్ట" అంటూ ఓ చిన్న సైజు లంఖిణీ గొంతుక, ఆ ఊరి నిశ్శబ్దాన్ని భంగం చేసిందిరా అబ్బాయ్.

లోకబాంధవుడు లోకాలేలడానికింకా బయల్దేరలేదు. ఈ లోపున, ఆయనరాక ఆమడదూరం నుంచే పసిగట్టిన చుక్కలు వెలాతెలా బోతున్నాయ్. పగటి శ్రమని, రాత్రి నిద్రలో వదిలించుకున్న ఊరు, మెల్లిగా బద్ధకం వది లించుకుంటోంది. అక్కడక్కడ కోడి పుంజులు గొంతు కలు సవరించు కుంటున్నాయ్. పాకల్లో పశువులు, కట్టు కొయ్యల దగ్గర కదలాడటం ప్రారంభించాయ్. దూడలు, తల్లుల దగ్గర జేరడానికి కన్నెతాడుని బిగపట్టి లాగు తున్నాయ్. 'అప్పుడే తెల్లారిపోతోందెహె'అని ముణగదీసి పడుకున్న పాలేర్లు విసుక్కుంటున్నారు. వయసు మళ్ళిన వాళ్ళు 'రామయ్య తండ్రి' అని ఆవులిస్తూ చిటికె లేస్తున్నారు. నడివయసువాళ్ళు అరుగుల మీద, నడవాల్లోనూ అటూ యిటూ కదుల్తున్నారు. వయసు ఉరకలేస్తున్నవాళ్ళు కదుల్తున్న కమ్మాలాక్తున్ని గట్టిగా పట్టేసుకుని, వాళ్ళ గొంతులు పైకి వినిపించకుండా కమ్మేస్తున్నారు. అలా, ఆ పల్లె బద్ధకాన్ని ముసుగేసుకుంటున్నవేళ, 'నీ శ్రాద్ధం బెట్ట' అన్న కేకతో 'తెల్లారి పోయిందిరా బాబూ' అంటూ వులిక్కిపడి లేచిందిరా అబ్బాయ్.

వలమయ్యగారు, వీరయ్యగారు అలవాటు ప్రకారం కబుర్లు చెప్పుకుంటూ అరుగుమీదే పడుక్కున్నారు. కబుర్లమీద కబుర్లు కలబోసుకుంటూ రాత్రి మూడో ఝాము ప్రవేశించాక పడుకున్నారేమో, ఆ లంఖిణీ కేకకి వీరయ్యగారు అదిరిపడ్డట్టుగా లేచార్రా 'వెదవ సంత' అని గొణుక్కుంటూ వలమయ్యగారూ లేచార్రా అబ్బాయ్.

'ఏరా ఈ పీడింకా వదల్లేదురా' అన్నారు వీరయ్యగారు.

"ఈ వూరు వూరంతా కట్టకట్టుకుని గోదాట్లో కలిసినా ఈ పీడ విరగడవదురా."


## నీ శ్రాద్ధం బెట్ట...

"దెబ్బైయేళ్ళు నిండాయి దండుముండకి. ఇంకా ఎంత కాలంరా!"

"మరో దెబ్బై వచ్చినా అంతే."

"అవుల్లే ఆ యముడిక్కూడా వణుకు పుట్టి వుంటుంది. వాడి శ్రాద్ధం ఎక్కడ పెట్టేస్తుందో అని."

వీరయ్య, వలమయ్యగార్ల మధ్య సంభాషణ క్రమం ఈ విధంగా సాగుతూవుండగా, "పింజారీ వెధవలు" అంటూ సదరు లంఖిణీ తాలూకు గొంతు సవ్వరుమందిరా అబ్బాయ్.



"మనల్నేమిట్రా" అన్నారు వీరయ్యగారు.

"చెప్పలేం" అని వలమయ్యగారి సమాధానం.

"ఇన్ని రోజులు ఉపేక్షించడం పొరబాటే. ఈరోజు తేల్చెయ్యాల్రా."

"నీ కెందుకురా రోడ్డున పోయేది నెత్తికి రాసుకుంటావు."

"ఎవడూ రాసుకోకపోతే అదలా కరుస్తూనే వుంటుందిరా. నువ్వేం ఖంగారుపడకు నేనేమీ అనవసర హైరాన పడన్లే" అన్నారు వీరయ్యగారు.

అసలు విషయమేమిటంటే అబ్బాయ్ సదరు లంఖిణిగా వ్యవహరింపబడుతున్న శాల్తీ పేరు రంగమ్మ. "రంకెలమ్మ" అని చాటుగా వ్యవహరిస్తారనుకో. కాపరానికొచ్చిన రెండేళ్ళకే మొగుడికి శ్రాద్ధం బెట్టేసిందిరా అబ్బాయ్! ఆ ఇల్లాలు. కొద్ది తేడాలో అత్త మావలకీ పెట్టేసింది. ఆ తరువాత, చేసిన రెండేళ్ళ కాపరం తాలూకు పిండ ప్రధానంలా మిగిలిన కొడుకుని పెంచుకుంటూ, వడ్ల గింజకూడా పోనియ్యకుండా రైతుల ముక్కు పిండుతూ, ఊరికంతటికీ రోజూ శ్రాద్ధంపెడుతూ, నోటితో జయించుకొస్తుందిరా— ఆ రంగమ్మ తల్లి. ఆ కొడుక్కి పెళ్ళి చేసి మనవల్ని కూడా ఎత్తుకుంది. కాస్త ఓపిక పడితే ముని మనవణ్ణికూడా చూసెయ్యగలదు.

సదరు రంగమ్మతల్లి కోడికంటె ముందే లేచి, గుమ్మం ముందు పాచిచెయ్యడం ప్రారంభిస్తుందిరా. ఆ దెబ్బతో ఊరంతా మేల్కోవలసిందే. ముందు కొబ్బరి చీపురుతో తుడుపు ప్రారంభిస్తుంది బర్రుబర్రుమంటూ. ఆ కొబ్బరి చీపురుకూడా దొడ్లో కింద పడిన కొబ్బరి మట్టల ఈనెలు తీసి కట్టిందే. తలుపు తీసుకుని వాకిట్లోకి రాగానే, ఏ పేడ కడో, ఏ పిల్లి ముఖమో, ఏ వూరకుక్కో దర్శనమవుతుంది. సదరు పదార్థాన్ని "నీ శ్రాద్ధం బెట్ట" అని తిట్టడంతో ఆవిడ దినచర్య, ఆ వూరి దినచర్య ప్రారంభమవుతుంది.

ఆ తుడుపు ఓ పట్టాన పూర్తవదురా. తుడిచిన చోటే తుడుస్తూ తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతూ, అలా తుడిచేస్తూనే వుంటుంది. అదో మహాయజ్ఞం. అది పూర్తయ్యాక ముగ్గులెట్టడం. అశ్వమేధయాగం చేసినంత తతంగంరా అది. ఇవన్నీ పూర్తవడానికి ఎంత కాలం పడుతుందా అన్నది దేవుడిక్కూడా తెలియదు. ఆ వూరికసలే తెలియదు. అది ఆరోజు ఆ వూరు చేసుకున్న పూర్వజన్మ సుకృతం మీద ఆధారపడ్డ విషయం.

రంగమ్మతల్లి పాచిపని పూర్తయ్యేలోగా, ఆ వూరి కటు ఏడుతరాలు, ఇటు ఏడుతరాలు తరించిపోతాయిరా అబ్బాయ్. ఆ వూరంతా కట్టకట్టి, ఆవిడ పాచిపని పూర్తి చెయ్యకుండా అడ్డుపడుతోందని ఆవిడ ధృఢ విశ్వాసంరా. ఆ అడ్డంకులు ఆవిడ నవకే ఎప్పటి కప్పుడు జయించుకొస్తోందన్నది కూడా ఆవిడ ధృఢ విశ్వాసమే.

ఆవిడ పాచిపని చేస్తున్నంతసేపూ, ఆవిడకి ఆమడ దూరంలో అటూ, యిటూ ఏ విధమైన నరసంచారం కాని, జీవ సంచారం కాని, క్రిమి కీటకాదుల విహారం కాని వుండకూడదు. ఏవిధమైన సంభాషణా వినపడకూడదు. ఎవరు మాట్లాడుకున్నా ఆవిడని, ఆవిడ పాచిపనిని విమర్శిస్తున్నారనే భావిస్తుందిరా ఆవిడ. ఆఖరికి కుక్క మొరిగినా, పక్షి అ రి చి నా ఆవిడ విరుచుకుపడుతుంది.

ఆ ఘట్టం చూసి తీరాల్సిందే కాని, వివరించి

చెప్పడం కష్టంరా అబ్బాయ్. దూరంగా నిలబడి చూడటం కూడా ప్రమాదమే. "సోద్యం చూస్తున్నావురా సొట్టపీనుగా; నీ శ్రాద్ధం మాలకాకులు కూడా ముట్టవురా ముండపీనుగా" అని ఉప్పెనలా విరుచుకు పడుతుందిరా.

"నీ శ్రాద్ధం బెట్ట"తో ప్రారంభించి, "నిన్ను అడ్డంగా తగలెయ్య, నీ పిండం పిల్లులు బెట్ట, నిన్ను కాట్లో కాకిముండలు బెట్ట, నీ పీనుగు పందులు తియ్య, నీ గుడ్డు గూళ్ళలోంచి పీకెయ్య"లాంటి వినూత్న ప్రయోగాలతో తెలుగు భాషని పటిష్టం చేస్తుందిరా ఆ మహాతల్లి. ఆవిడ నోటితోపాటు చేతులు, కాళ్ళు, కళ్ళు కూడా భావ ప్రకటన స్ఫుటంగా చేస్తాయి. ఆ చేతుల ముద్రలు ఏ నృత్య కళలోనూ భాసిల్లగా చూసివుండం. ఆవిడ పదఘట్టనలు ఏ తాళానికీ అందవు. ఆవిడకళ్ళు తిప్పే నట్టుగా కొమ్ములు తిరిగిన నాట్యకత్తె కూడా తిప్పలేదురా అబ్బాయ్.

యధావిధిగా, ఆరోజు కూడా సదరు రంగమ్మతల్లి రంగంలోకి దూకింది. దాన్ని వీరయ్యగారు ఎదుర్కోడానికి సిద్ధపడ్డారురా. ఆయన అరుగు దిగలేదు. ఆవిడ ఆ యింటి గుమ్మం దాటలేదు. అయినా, ఆ యుద్ధం కడు రసవత్తరంగా సాగిందిరా.

"పింజారీ వెధవలు"అని పద ప్రయోగం చేసాక, రంగమ్మ ఝుడుస్తోంది. వీరయ్యగారు లేచి నిలబడి గట్టిగా గొంతు సవరించుకున్నారు.

"అప్రాచ్యపు పీనుగ"అని ప్రారంభించి ఒక పావు గంట గుక్కతిప్పకోకుండా అవధానం చేసింది రంగమ్మ.

ఆవిడ గుక్క తిప్పకోడానికి ఆగాక, నోట్లో వున్న వేపపుల్లని తీసి, "థూ" అని వుమ్మేశారు వీరయ్యగారు.

"నీ నాలుక నక్కలు పీకెయ్య. నీకేం పొయ్యేకాలం వచ్చిందిరా జెష్టపీనుగ" అంటూ మరో అరగంట శతావధానం పూర్తయింది.

ఈ లోపున వీరయ్యగారి దంత ధావనమూ పూర్తి అయింది. ముఖం తుండుగుడ్డతో తుడుచు కుంటూ, "ఓసి జెష్టా" అన్నార్రా.

"జెష్టంటే జెష్టంటావురా దేభ్యం పీనుగా" అంటూ చీపురుకట్టని, "జెండాపై కపిరాజు" అన్న ధోరణిలో ఊగిస్తూ మరో గంటసేపు రంగమ్మ తాండవం చేసింది.

ఆవిడ అలా అనగానే, బాసీపట్టువేసుక్కూర్చున్న వీరయ్యగారు "ఓసి భటికీ" అన్నారు.

"అబ్బ నారి పీనుగా. మిూసాలకి మెతుక్కూడా అంటదురా ముంగిస పీనుగా" అంటూ రంగమ్మ చేసిన విన్యాసాలారే అబ్బాయ్, చూసి తీరవలసిందేరా.

అబ్బాయ్, అలా అపరాహ్ణం దాటిపోయిందిరా. రంగమ్మ తుడుపు పూర్తవలేదు. వీరయ్యగారు అరుగు దిగలేదు.

"నిన్ను తగలెయ్య" అన్నార్రా వీరయ్యగారు.

"నన్ను తగలెయ్యడానికి నువ్వెవడివిరా. నీకంత అదృష్టమటరా ముదనష్టప్పీనుగ. వెయ్యి జన్మలెత్తినా, తపస్సు చేసినా నీకాయోగం పట్టదురా భ్రష్టు పీనుగా" అంటూ అంకమ్మ శివాలు తొక్కేసిందిరా ఆ రంగమ్మ.

సోద్యం చూస్తున్న సూర్నాయణమూర్తికి కూడా విసుగొచ్చి, పడమట దిక్కుకు వడివడిగా కదిలి పోతున్నాడురా. రంగమ్మ పాచిపని పూర్తవలేదు. వీరయ్యగారు కూచున్న చోటునుంచి కదల్లేదు.

రంగమ్మ కొడుకు అక్కణ్ణుంచే దణ్ణం పెట్టేడురా వీరయ్యగారికి. జాలేసిన వీరయ్యగారు లేచిపోదామనుకుంటున్నంతలో ఆ రంగమ్మతల్లి వీరాంగం తొక్కిందిరా.

"పింజారీ పీనుక్కి దణ్ణంపెడతావేరా పిట్టపీనుగా. నిన్ను పుటం పెట్టినా నీకు బుద్ధిరాదురా బోడిపీనుగా. పీర్ల పండగనాడుకూడా నీ పీనుగెవరూ ఎత్తర్రా నాసి పీనుగా" అంటూ కొడుకూమీద,అమ్మశక్తిలా ఎగిరెగిరి పడిందిరా ఆ మహాతల్లి.

ఒరేయ్, అబ్బాయ్. అలా ఎగిరిపోతున్న రంగమ్మ ఓ వెర్రికేక పెట్టి కింద పడిపోయిందిరా. ఓకాలూ, చెయ్యి కొంకర్లుపోయాయి. నోరు పెగల్దీసినా శబ్దం బయటికి రాలేదురా. పాపం, ఆ కొడుకు, ఆ తల్లిని మెల్లిగా ఎత్తుకుని లోపలికి తీసుకుపోయాడురా అబ్బాయ్.

వీరయ్యగారు కూచున్న చోటునుంచీ కదిలార్రా. ఆయన ముఖం మటుకు విషణ్ణంగానే వుందిరా అబ్బాయ్.

అబ్బాయ్, లోకానికి హితం చెయ్యాలంటే కొంత హింస తప్పదురా.

*



CHAITRA-B G 342 TEL